RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 228 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | బుధవారం, 21 ఫిబ్రవరి 2024 | పేజీలు : 4 | వెల : 2/-

## ప్రారంభమైన తెలంగాణ కుంభమేళా...

# మేడారం జాతర





### మేడారానికి పగిడిద్దరాజు, జంపన్నలు!!

మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు మేడారం సిద్ధమైంది. మేడారం మహా జాతరలో తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా ఆంధ్రప్రదేశ్, చత్తీస్ గడ్, మహారాష్ట్ర ,ఒరిస్సా తదితర రాష్ట్రాల నుండి భక్తులు కోట్లాదిగా వచ్చి సమ్మక్క సారలమ్మలను దర్శించుకుంటున్నారు. ఇప్పటికే మేడారం జన సంద్రమైంది. భక్తులు సమ్మక్క సారలమ్మలకు మొక్కులు చెల్లించుకుని, బంగారాన్ని నివేదించుకుంటున్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరున్న మేడారం జాతర బుధవారం నాడు ప్రారంభం కానున్న క్రమంలో నేడు మేడారం రాజు, వనదేవరుడు, సమ్మక్క భర్త పగిడిద్దరాజును తీసుకువచ్చే కార్యక్రమం కొనసాగుతుంది. అలాగే సమ్మక్క కుమారుడు జంపన్నను సైతం పూజారులు మేడారం తీసుకు వెళుతున్నారు. దీంతో జాతర ప్రారంభం అవుతుంది. మేడారం గద్దెల పైకి వచ్చే దేవతలు, దేవరలు అందరినీ కాలినడకనే తీసుకురావటం విశేషం. నేడు పూనుగొండ్లలో దేవుడు గుట్ట నుండి పగిడిద్దరాజును తీసుకువచ్చి దేవాలయంలో ప్రతిష్టించి శాంతి పూజా కార్యక్రమాలను చేసిన అనంతరం, పెన్క వంశీయులు పడగ రూపంలో ఉన్న పగిడిద్దరాజును పెళ్ళికొడుకు గా సిద్ధం చేసి ఆ పడగ రూపాన్ని గ్రామంలో ఊరేగించి, ఆపై పూనుగొండ్ల అడవుల నుంచి మేడారానికి కాలినడకన తీసుకువెళ్ళారు. పూజారి జగ్గారావు తో పాటు మరో పది మంది పూజారులు, భక్తులు పగిడిద్దరాజు వెంట మేడారం వెళతారు. మధ్యలో గోవిందరావుపేట మండలం కర్కపల్లి లక్ష్మీపురంలో పెన్క వంశీయుల వద్ద రాత్రికి పగిడిద్దరాజు విడిది చేస్తారు. ఆపై మళ్ళీ బుధవారం ఉదయాన్నే బయలుదేరి సారలమ్మ గద్దె చేరటానికి ముందే పగిడిద్దరాజును మేడారం గద్దెకు చేరుస్తారు. సమ్మక్క తనయుడు సారలమ్మ సోదరుడైన జంపన్న ను కన్నెపల్లి నుంచి పోలెబోయిన వంశస్తులు మేడారం తీసుకువస్తారు. పూజారి పోలెబోయిన సత్యమైన కుటుంబ సభ్యులు గ్రామస్తులు మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు కన్నెపల్లి నుంచి బయలుదేరి రాత్రి 7 గంటలకు మేడారానికి చేరుకున్నారు. ఆపై లక్షల మంది భక్తుల మధ్య జంపన్నను గద్దెపై ప్రతిష్టించారు. పగిడిద్దరాజు గద్దెల మీదికి చేరుకోవడంతో మేడారం జాతరలో ప్రధాన ఘట్టానికి అంకురార్పణ జరిగింది.



### అందుకే... మూడోసారి మోడీ ప్రధాని కావాలి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20: ప్రజలు మూడోసారి మోడీ ప్రధాని కావాలని కోరుకుంటున్నారని కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాలో నిర్వహించిన విజయసంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ అవినీతి రహితపాలన అందిస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోడీ పదేళ్లలో 4 కోట్ల ఇళ్లు కట్టించటం జరిగిందన్నారు. దురదుష్టవశాత్తు తెలంగాణలో బీఆర్ఎస్ వైఖరి వల్ల ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో జరగలేదని అన్నారు. నిరుపేదలు వైద్య కోసం ఇబ్బందులు పడకుండా కేంద్రం చర్యలు చేపడుతుందన్నారు. పేదల కోసం మోడీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. “గతంలో తెలంగాణలో కేసీఆర్ కుటుంబం ఖానా.. పీయా.. చెలేగయా.. ఇప్పుడు తెలంగాణ సంపదను దోచుకుని లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్ చూస్తోంది” అంటూ ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో టెర్రరిస్టులు, ఉగ్రవాదులు పెట్రేగిపోయారన్నారు. నేడు ఉగ్రవాదాన్ని మోడీ ఉక్కుపాదంలో అణచివేయటంతో దేశం ప్రశాంతంగా ఉందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలు దేశానికి సంబంధించిన ఎన్నికలనే విషయాన్ని జనాలు గమనించాలన్నారు.




## శభాష్ సీతక్క...

### మేడారం జాతరలో ఏర్పాట్లపై భక్తుల హర్షం!!

మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తజనం పోటెత్తింది. మేడారం జాతర రేపటి నుంచి నాలుగు రోజులపాటు జరుగుతున్న క్రమంలో ఇప్పటికే లక్షలాదిమంది భక్తులు మేడారం చేరుకొని అమ్మవార్లను దర్శించుకున్నారు. మంత్రి సీతక్క తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న మేడారం జాతరకు సంబంధించి ఏర్పాట్లను అనునిత్యం పర్యవేక్షిస్తూ, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తీసుకుంటున్నారు. మేడారం జాతర నేపథ్యంలో జాతర ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం తరపున ఇప్పటికే 110 కోట్ల రూపాయలను కేటాయించి ఏర్పాట్లు చేయడం జరిగింది. అయితే సామాన్య భక్తులను దృష్టిలో పెట్టుకొని మేడారంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని భావించిన మంత్రి సీతక్క, మేడారంలోనే ఉండి ఎప్పటికప్పుడు అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. గతం కంటే భిన్నంగా ఈసారి మేడారం జాతర చాలా బాగా జరుగుతుందని ప్రజల నుండి స్పందన వస్తోందంటే సీతక్క జాతర కోసం ఎంతగా కష్టపడ్డారు అనేది అర్థం చేసుకోవచ్చు. మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి వస్తున్న భక్తులు గద్దెల పైకి వెళ్లి అమ్మవార్లను దగ్గరగా దర్శనం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో గద్దెల పైకి వెళ్లడానికి వీలు లేకుండా తాళం వేసే వారని, అమ్మవారికి మొక్కులు, బంగారం గద్దెలపైకి విసిరి వెళ్ళవలసి వచ్చేదని, కానీ ఈసారి అందుకు భిన్నంగా సామాన్య భక్తులకు కూడా అమ్మవారి దర్శనం సునాయాసంగా దొరుకుతుందని చెబుతున్నారు. అంతేకాదు రేవంత్ రెడ్డి సర్కార్ ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడంతో, మేడారం జాతరకు మహిళలంతా సంతోషంగా రాగలుగుతున్నారు అని హర్షం వ్యక్తం చేస్తున్నారు. మేడారం జాతరకు వచ్చే క్రమంలో రోడ్ల పనులు కూడా పూర్తిచేసి, ఎక్కడా రవాణా ఇబ్బంది లేకుండా చూశారని, ట్రాఫిక్ పై ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టారని , ఈ జాతర తమ మనసుకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని భక్తులు చెబుతున్నారు. మంత్రి సీతక్క చొరవను కొనియాడుతున్నారు. ఆదివాసి బిడ్డ అయిన సీతక్క వనదేవతలకు చేస్తున్న సేవ గొప్పదని, అమ్మల జాతర కోసం నిద్రాహారాలు మాని సీతక్క చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడుతున్నారు. జై సీతక్క అంటూ కితాబిస్తున్నారు.






## తెలంగాణ రాజకీయాలు రంగులు మారుతున్నాయా...?

## ఢిల్లీతో దోస్తీకేనా...!

### కేసీఆర్ హస్తిన పర్యటనపై సర్వత్రా ఉత్కంఠ!!

హైదరాబాద్ : బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ కి ఢిల్లీతో అర్జెంటుగా పని పడిందా అన్న అనుమానాలు వస్తున్నాయి. సుమారు రెండున్నర నెలల క్రితం తెలంగాణాలో ప్రభుత్వం మారింది. బీఆర్ఎస్ ఓడింది. కేసీఆర్ మాజీ సీఎం అయ్యారు. ఆనాటి నుంచి ఆయన చాలా సమయం ఇంటివద్దనే ఉంటున్నారు. ఇటీవల నల్గొండ జిల్లాలో ఆయన ఒక భారీ సభతో జనంలోకి వచ్చారు. ఇపుడు లోక్ సభ ఎన్నికలు ముంచుకు వస్తున్న వేళ బీఆర్ఎస్ ని గేరప్ చేయాల్సిన అవసరం ఉంది. సర్వేలు చూస్తే కాంగ్రెస్ లేదా బీజేపీకి మొగ్గు అని చెబుతున్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో ఉనికి చాటుకోకపోతే ఒక ప్రాంతీయ పార్టీగా మరిన్ని కొత్త ఇబ్బందులతో కూరుకుని పోయే ప్రమాదం ఉంది అని విశ్లేషణలు వస్తున్నాయి. ఇంకో వైపు చూస్తే బీఆర్ఎస్ ఒంటరి పోరు చేస్తే కాంగ్రెస్ కి మేలు జరుగుతుందని లేదా బీజేపీ బలంగా ఉన్న చోట్ల కొన్ని సీట్లు కొట్టుకుపోతుందని కూడా అంటున్నారు. దీంతో పొత్తులకు బీఆర్ఎస్ ఆలోచిస్తోంది అని వార్తలు వినిపిస్తున్నాయి. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తులకు సుముఖంగా ఉందా అన్న చర్చ కూడా సాగుతోంది. ఇది అనివార్యం అని అంటున్నారు. బీజేపీతో పొత్తు ఉంటే బలంగా కూటమి కట్టి కాంగ్రెస్ మీద పోరాడడం సులువు అవుతుందని అంటున్నారు. అలాగే కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటుంది కాబట్టి పొత్తు పార్టీగా కేంద్రంలో మళ్లీ మోడీ ప్రభుత్వం ఏర్పడితే కేంద్ర మంత్రి పదవులు కూడా సాధించవచ్చు అన్న ఆలోచనలు ఉన్నాయని అంటున్నారు. ఇక తాజాగా బీఆర్ఎస్ ఒక సర్వే చేసినట్లుగా ప్రచారం సాగుతోంది. ఆ సర్వేలో బీజేపీకి తొమ్మిది సీట్లు కాంగ్రెస్ కి నాలుగు సీట్లు బీఅర్ఎస్ కి మూడు మజ్లీస్ కి ఒక సీటు వస్తుందని తేలింది అని అంటున్నారు. దాంతో బీజేపీతో పొత్తు కోసం కేసీఆర్ తానుగా పనిగట్టుకుని మరీ ఢిల్లీ వెళ్తున్నారు అని అంటున్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఇటీవల ముగిసాయి. ఉత్తరాది పొత్తులలో క్లారిటీ తెచ్చుకున్న బీజేపీ సౌత్ మీద ఫోకస్ పెట్టింది. కర్నాటకలో ఇప్పటికే జేడీఎస్ తో పొత్తు పెట్టుకుంది. తమిళనాడులో అన్నా డీఎంకే వీడిపోయింది. ఇతత చిన్న పార్టీలతో కూటమి కట్టాలని చూస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా పొత్తుల విషయంలో క్లారిటీ కోసం చూస్తోంది. ఏపీలో చంద్రబాబుతో పొత్తు కుదిరినట్లే అంటున్నారు. ఇక తెలంగాణాలో ఒంటరి పోరే అని బీజేపీ నేతలు చెబుతున్నా అక్కడ కాంగ్రెస్ ఎక్కువ ఎంపీ సీట్లు దక్కించుకోరాదు అన్న పట్టుదల బీజేపీ పెద్దలకు ఉంది అని అంటున్నారు. దాంతో బీఆర్ఎస్ తో పొత్తుకు బీజేపీ పెద్దలు కూడా సుముఖంగా ఉన్నారా అన్న చర్చ సాగుతోంది. ఇన్ని రకాలైన ఆలోచనలు చర్చన నడుమ కేసీఆర్ ఢిల్లీ పర్యటన పెట్టుకున్నారు. కేసీఆర్ ఢిల్లీ టూర్ తో తెలంగాణా రాజకీయాలలో కీలకమైన మార్పులు సంభవిస్తాయని అంటున్నారు. మొత్తం మీద చూస్తే పొత్తులు ఎత్తులు వ్యూహాల మధ్య గులాబీ బాస్ హస్తిన పర్యటన తొందరలోనే ఉంటుందని అంటున్నారు. అయితే బీఆర్ఎస్ తో పొత్తుల ఊహాగానాలను మాత్రం తెలంగాణా బీజేపీ నేతలు కొట్టేస్తున్నారు. మరి బీజేపీ బీఆర్ఎస్ పొత్తులు ఉంటాయా లేవా అన్నది కేసీఆర్ ఢిల్లీ టూర్ తరువాత ఫుల్ క్లారిటీ వచ్చే చాన్స్ ఉంది.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# బెంగాల్ సహా సుప్రీంకోర్టును కుదిపేస్తున్న సందేశ్ ఖాలీ... అసలేంటిది?

గత వారం రోజులుగా దేశంలో ముఖ్యంగా ఉత్తరాదిన పెను సంచలనంగా మారిన వ్యవహారం సందేశ్ ఖాలీ మన దక్షిణాది రాష్ట్రాల్లో ఈ వ్యవహారం పెద్దగా సంచలనం కాలేదు కానీ.. ఉత్తరాది సహా ఢిల్లీ వర్గాలు, సుప్రీంకోర్టులోనూ తీవ్ర సంచలనంగా మారింది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ వర్సెస్, బీజేపీల మధ్య నిప్పులు రాజేసింది. అంతేకాదు.. ఒకవైపు మహిళా కమిషన్ చైర్ పర్సన్ సందర్శన... మరోవైపు.. పార్లమెంటు ఎథిక్స్ కమిటీ క్షేత్రస్థాయి పర్యటన.. ఇవన్నీ ఇలా ఉంటే.. సుప్రీంకోర్టులో వరుస కేసులు.. ఇలా మొత్తంగా.. పశ్చిమ బెంగాల్ సహా సుప్రీంకోర్టును ఉత్తరాదిని ఈ సందేశ్ ఖాలీ అంశం పెద్ద ఎత్తున కుదుపునకు గురి చేస్తోంది.

**అసలేంటిది? :** సందేశ్ ఖాలీ.. అనేది పశ్చిమ బెంగాల్‌లోని 24 ఉత్తరపరగణాల జిల్లాలో ఉన్న ఓ మారు మూల ప్రాంతం. ఇక్కడ పెను వివాదం రాజుకుంది. అధికార పార్టీ తృణమూల్‌కు చెందిన కీలక నేత షాజహాన్ షేక్ అనుచరులు.. తమ భూములను బలవంతంగా కబ్జా చేశారని, దీనిని ప్రశ్నించిన తమపై.. లైంగిక దాడులు చేశారని, ఒకరిద్దరిద్దరిపై అత్యాచారం కూడా చేశారని.. ఇక్కడి మహిళలు ఆరోపించారు. ఈ వ్యవహారం... గత వారం వెలుగు చూసింది. ఈ విషయం రాష్ట్రంలో ప్రచారంలోకి రావడంతో ప్రతిపక్ష బీజేపీ దీనిని సీరియస్‌గా తీసుకుంది. వెంటనే రాష్ట్ర బీజేపీ నాయకుడు, పార్లమెంటు సభ్యుడు సుకాంత మజుందార్.. ఘటనా ప్రాంతానికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇటు తృణమూల్ కార్యకర్తలు, నాయకులు, అటు బీజేపీనేతలకు మధ్య తీవ్ర దుమారం రేగింది. వీరిని అదుపు చేసే క్రమంలో పోలీసులు లాఠీ చార్జీలు కూడా చేశారు. దీంతో ఎంపీ మజుందార్ తీవ్రంగా గాయపడ్డారు. ఇది మరో వివాదానికి దారి తీసింది. తనను పోలీసులు కొట్టారంటూ.. ఎంపీ పార్లమెంటు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఇక, బాధితులమని చెబుతున్న మహిళలు.. మీడియా ముందుకు రావడం, వారికి బీజేపీ మద్దతు పలకడంతో వివాదం రాజుకుంది. దీనిపై మహిళా కమిషన్ కూడా తీవ్రంగా స్పందించి.. ఏకంగా ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీని సందేశ్ ఖలీ గ్రామానికి పంపించింది. అయితే.. వారిని కూడా తృణమూల్ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఇలా.. ఒకదాని తర్వాత ఒకటి పరిస్థితులు ఏర్పడడంతో సీఎం మమతా బెనర్జీ స్పందిస్తూ.. ఇదంతా ఉద్దేశ పూర్వకంగా ఎన్నికలకు ముందు బీజేపీ ఆడుతున్న నాటకంగా పేర్కొన్నారు. మరోవైపుబాధిత మహిళలను బయటకు తీసుకువచ్చిన మహిళా కమిషన్.. వారితో కేసులు పెట్టించింది. దీంతో 18 మంది అధికార పార్టీ కార్యకర్తలపై రేప్, హత్యాయత్నం కింద పోలీసులు కేసులుపెట్టారు. ఇక, రాష్ట్రంలోకి పార్లమెంటు ఎథిక్స్ కమిటీ రావడం ఏంటని ప్రశ్నిస్తూ.. తృణమూల్ కాంగ్రెస్ సుప్రీంకోర్టుకు ఎక్కింది. దీనిని విచారించిన కోర్టు ఎథిక్స్ కమిటీ పర్యటనపై స్టే విధించింది. ప్రస్తుతం ఈ వ్యవహారం మరింత ముదురుతూనే ఉంది. సందేశ్ ఖాలీలో ప్రస్తుతం అప్రకటిత కర్ఫ్యూను అమలు చేస్తున్నారు.

# సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం అందరికి ఆదర్శప్రాయం

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

### ఆదిలాబాద్ లో ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి












**ఆదిలాబాద్ ఫిబ్రవరి 20(ప్రభాత సమాచారం)**

బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285 వ జయంతిని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో స్థానిక రాంలీలా మైదాన్ లో మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యేలు వెడ్మ భోజ్జు పటేల్, అనిల్ జాదవ్, జడ్పీ ఛైర్మెన్ జనార్ధన్ రాథోడ్, మాజీ ఎంపీ గేడం నగేష్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాథోడ్ సురేష్ నాయక్, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, ప్రజా ప్రతినిధులు, అధికారులు, బంజారా సమాజ్ నాయకులుబొగ్ బండార్ కార్యక్రమం లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285 వ జయంతి ఉత్సవాల ను పురస్కరించుకొని జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్క ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారని అన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ జీవిత చరిత్రను వివరించారు. 1739, ఫిబ్రవరి 15 న అనంతపురం జిల్లా రాంజీ తాండా లోసంత్ సేవాలాల్ మహరాజ్ జన్మించారని, ఆయన జీవితం ఎందరికో ఆదర్శంగా నిలిచిందని అన్నారు. హింస, మత్తు , ధూమ పానాలకు దూరంగా వుండాలని హితువు పలికి యావత్ ప్రజానికానికి ఆదర్శంగా నిలిచారని , బంజారా జాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చిన ఒక విప్లవ చైతన్య మూర్తి అని అన్నారు. దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్త , సమాజ శ్రేయస్సు కోసం సంత్ సేవాలాల్ చూపించిన మార్గం ఆదర్శనీయమన్నారు. సేవాలాల్ మహారాజ్ తన బోధనల వల్ల బంజారా జాతి పురోగమించడానికి ఎంతో కృషి చేశారని, వారి అభివృద్ధికి, తండాల నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడని ఆయన సేవలను కొనియాడారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలల్ మహరాజ్ చూపిన మార్గంలో పయనించి, ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. చిన్న తనం నుండే సేవాగుణం అలవర్చుకొని నలుగురికి సహాయపడే వారని, బంజారాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ సేవాలాల్ ప్రజల మేలుకోసం అనేక ఉద్యమాలు చేశారని, చెడు అలవాట్లకు దూరంగా వుండాలని బోధించేవారని , ఆదర్శవంతమైన ఆయన జీవితాన్ని అందరు ఆచరించాలని అన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సేవాలాల్ మహారాజ్ ఆశయాలను కొనసాగించాలని , వారు చూపించిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు జడ్పీ ఛైర్మన్ రాథోడ్ జనార్ధన్, డిసిసిబి ఛైర్మన్ బోజారెడ్డి, అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్. సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# అభివృద్ధి పనులకు భూమి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



**తాండూర్, ఫిబ్రవరి20(ప్రభాత సమాచారం)**

మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకము ద్వారా మంజూరైన ఒక కోటి 20 లక్షల రూపాయల నిధుల అంచనా వ్యాయామంతో నిర్మించ తలపెట్టే సీసీ రోడ్లకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మంగళవారం భూమి పూజలు చేశారు. మాదారం జీపి, తాండూర్ జీపి, రేచీని జీపి, కిష్టంపేట జీపి, బోయపల్లి జీపి లలో సిసి రోడ్లకు భూమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారంలో గ్రామాలకు వచ్చినప్పుడు రోడ్ల పరిస్థితి పై ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత సిసి రోడ్లు మంజూరు చేయించి భూమి పూజలు చేస్తున్నానన్నారు. తాండూర్ మండలం నుండి తనను బెల్లంపల్లి నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించిన మండల ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండి మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గెలుపొందిన తరువాత మొట్టమొదటిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకము ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యముతో పాటు ఆరోగ్యశ్రీ పథకాన్ని ఐదు లక్షల నుండి పది లక్షల రూపాయలకు పెంచిందన్నారు. అలాగే 500 రూపాయలకే మహిళలకు గ్యాస్ సిలిండర్లా పథకము, తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి రెండు వందల యూనిట్ల ఉచిత కరెంటు గృహజ్యోతి పథకము ఫిబ్రవరి మాసములోనే ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గం కృషి చేస్తుందన్నారు. అనంతరం తాండూర్ మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశమునకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరైనారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ప్రభుత్వం తాను ఎప్పుడూ అండగా ఉంటానని ఏ కష్టము వచ్చినను అందుబాటులో ఉండి ఆదుకోవడానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా తాండూర్ మండలంలోని తాండూర్, గోపాల్ నగర్, కిష్టంపేట, రేచిని, అచలాపూర్, కొత్తపల్లి ,నర్సాపూర్, మాదారం త్రీ ఇంక్లైన్, మాదారం, రాజీవ్ నగర్,బోయపల్లి,చౌటపల్లి గ్రామపంచాయతీలకు చెందిన బి ఆర్ ఎస్ నాయకులు,సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరగా వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి ఈసా, ఎంపిటిసిలు సూరం రవీందర్ రెడ్డి, సిరంగి శంకర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ కె రత్నాకర్ రావు, సీనియర్ నాయకులు జి మురళీధర్ రావు, కే సుభాష్, సూరం దామోదర్ రెడ్డి, షేక్ మోమినాలి, మసాడి తిరుపతి, కే రంజిత్ కుమార్, షేక్ హైమద్, కేశెట్టి శ్రీనివాస్, ఎండి జుబేర్,పెద్దబోయిన శంకర్, కామని శ్రీనివాస్, చాంద్ ఖాన్, దుర్గం మహేందర్ వర్మ, లతోపాటు బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మనస్తాపంతో వృద్ధుని ఆత్మహత్య

**లక్షెట్టిపేట్ ఫిబ్రవరి 20(ప్రభాత సమాచారం)**



మండలంలోని సూరారం గ్రామానికి చెందిన పాలమాకుల నారాయణ (70 ) వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానిక ఎస్సై చంద్రకుమార్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ఈనెల 16వ తారీకున రాత్రి మద్యం తాగి వచ్చి బార్యతో గొడవపడి బార్యపై చేయిచేసుకుని ఇంట్లో నుడి వెల్లి పొలం వద్ద పడుకున్నాడన్నారు. తిరిగి మరుసటి రోజు ప్రొద్దున ఇంటికి వచ్చే సరికి బార్య పడుకొని బాధపడుతూ ఉండటం గమనించి మనస్థాపంతో తిరిగి పొలం వద్దకు వెల్లి పంటకు కొట్టె పురుగల మందు త్రాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. విషయం తెలిసిన ఆయన కుమారుడు మంచిర్యాల మెడిలైఫ్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారన్నారు. పరిస్థితి విషమయించడంతో మంగళవారం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యాహ్నం మార్గం మధ్యలో మృతి చెందాడన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారని, మృతుని కుమారుడు పాలమాకుల సురేందర్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.

# సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన బాటలో నడవాలి

### ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్




**ఆదిలాబాద్ ఫిబ్రవరి 20(ప్రభాత సమాచారం)**

సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా సంత్ సేవాలాల్ మహారాజ్, జగదాంబ,రామారావు మహారాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లంబాడాల అభివృద్ధి అన్ని విధాలుగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి యేటా సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహిస్తుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా లంబాడాలు వరకట్నం తీసుకుంటున్నారని అన్నారు. ఈ వరకట్నంను బ్యాన్ చేయాలని అన్నారు. లంబాడాలు ఎదురుకుంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెల్లి పరిష్కరించేలా చర్యలు చెపడతామన్నారు. అనంతరం సేవాలాల్ జయంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

## శతాబ్దం తర్వాత ఇంటి దైవాన్ని దర్శించుకున్న రాగి పరివారం



**తలమడుగు ఫిబ్రవరి 20 (ప్రభాత సమాచారం) :**
తలమడుగు మండలంలోని సాయిలింగి గ్రామానికి చెందిన మాలి కులస్తులైన రాగి పరివారం (శేండే) కుటుంబానికి చెందిన 25 కుటుంబాలు ఈ గ్రామం నుంచి మహారాష్ట్ర రాష్ట్రంలోని చంద్రాపూర్ జిల్లాలో షిండేవాయి తాలూకా గ్రామం జంసడ లో వాళ్ల ఇంటి దైవమైన వాగోబా (పులి) దేవస్థానాన్ని 100 సంవత్సరాల తరువాత రాగి పరివారం (శేండే) కుటుంబీకులు మంగళవారం రోజు వాళ్ళ దైవాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి వాళ్ళ కుటుంబీకులు, ప్రజలంతా ఆయురారోగ్యాలతో బాగుండాలని మొక్కుకున్నట్లు అదిలాబాద్ జిల్లా మాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాగి రామ్ కిషన్ పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఇంటి దైవాన్ని దర్శించుకోవడం ఎంతగానో సంతోషంగా ఉందని రాగి పరిహారమంతా రోజంతా సంతోషంగా గడిపారని ఒక్కసారైనా ఈ దైవాన్ని దర్శించుకోవాలన్న మా పిల్లల కల నెరవేరిందని రాగి పరిహారం (శేండే) సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో రాగి రాం కిషన్, రాగి ఈరన్న, రాగి పాండు, రాగి సంతోష్, రాగి మహదేవ్, సమస్త రాగి పరిహారం పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలు



**లక్సెట్టిపేట్ ఫిబ్రవరి 20(ప్రభాత సమాచారం)**
పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవ వేడుకలను తెలుగు విభాగంలో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన తెలుగు కవయిత్రి సుబ్బయమ్మ మాట్లాడుతూ అమ్మ భాష ఎంతో గొప్పదని మన భావాలను మాతృ భాషలో మాత్రమే స్పష్టంగా వ్యక్తం చేస్తామన్నారు. మనకు చిన్నతనం నుంచి మాధుర్యాన్ని పంచిన మాతృ భాషను మరువకూడదన్నారు. అదే విధంగా ఇతర భాషలను కూడా నేర్చుకోవాలని సూచించారు. అంతకుముందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తమ మాతృ భాషను మాట్లాడుతూ భాష పరిరక్షణకు కృషి చేయాలన్నారు. పిల్లలకు మాతృ భాష గొప్పతనం తెలియజేయాలని కోరారు. ఇంగ్లీష్ తో పాటు అన్ని భాషలను నేర్చుకోవాలన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలను మరువకూడదన్నారు. అంతకుముందు తెలుగు విభాగం అధిపతి డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులకు మాతృ భాష విలువలు తెలియజేయడానికే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు పలు రాష్ట్రాల భాషలలో తమ నాటికలను, నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ సురేష్, డాక్టర్ హరీష్,అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**తాండూర్, ఫిబ్రవరి20(ప్రభాత సమాచారం)**
తాండూర్ మండలానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరి చేసిన 25 కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మంగళవారం తాండూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 25 మంది లబ్ధిదారులకు రూ. 25,02900 కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు మంజూరి అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈస, ఎంపీటీసీలు సూరం రవీందర్ రెడ్డి, సిరంగి శంకర్, సింగల్ విండో వైస్ చైర్మన్ కే రత్నాకర్ రావు, జి మురళీధర్ రావు,షేక్ మోమీనాలి, ఎండి జుబేర్, కోడి ప్యాక రంజిత్ కుమార్, కేశెట్టి శ్రీనివాస్,పెద్ద బోయిన శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రాజ్యసభ ఎన్నికల్లో ఎన్డీయే అడ్డదార్లు

బెంగళూరు : కర్ణాటక రాజ్యసభ ఎన్నికల్లో విజయం కోసం ఎన్డీయే భాగస్వామ్య పార్టీలు అడ్డదారులు తొక్కుతున్నాయని, తమ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభ పెడుతున్నాయని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు జేడీఎస్ నేత, మాజీ సీఎం కుమారస్వామి ఫోన్‌చేసి పలు ఆఫర్లు ఇస్తున్నారని అన్నారు. కేంద్రంలో మళ్లీ వచ్చేది ఎన్డీయే ప్రభుత్వమేనని బెదిరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్ర శాసనసభలో కాంగ్రెసకు 136 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, మరో ఇద్దరు ఇండిపెండెంట్ల మద్దతు కూడా తమకే ఉందని శివకుమార్ చెప్పారు. ఈ లెక్కన బరిలో నిలబడ్డ ముగ్గురు అభ్యర్థులు తొలిరౌండులోనే గెలవడం ఖాయమన్నారు. శాసనసభలో తగిన బలం లేకపోయినా ప్రతిపక్షాలు రెండో అభ్యర్థిని బరిలోకి దించడం వెనుక బేరసారాల వ్యూహమే ఉందని తెలిపారు.

## ఫోర్ లైన్ రోడ్డుకు అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



**వీణవంక, ఫిబ్రవరి 20(ప్రభాత సమాచారం)**
ఫోర్ లైన్ రోడ్డుకు ప్రభుత్వ అనుమతులకు మించి అక్రమంగా తరలిస్తున్న మట్టి గత నెలరోజుల నుంచి వీణవంక మండలంలోని ఘన్ముక్ల తూర్పుకుంట నుండి మట్టిని తరలిస్తున్న వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఘన్ముకుల మాజీ సర్పంచ్ సునీత– మల్లారెడ్డి. తోపాటు గ్రామ రైతులు కోరారు. వారు తెలిపిన వివరాల ప్రకారం వీణవంక మండలంలోని ఘన్ముకుల గ్రామంలో గల తూర్పుకుంట నుండి ప్రభుత్వ అనుమతులు ఉన్నాయంటూ వీణవంక మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఫోరైన్ రోడ్డుకు రాత్రింబవళ్లు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నారని,వేల ట్రిప్పుల మట్టిని అక్రమంగా టిప్పర్లతో తీసుకెళ్తున్నారని ఆరోపించారు. తూర్పు కుంట నుండి పరిమితి మించి అక్రమంగా మట్టిని తీయడం ద్వారా భూగర్భ జలాలు అడుగంటి బావులలో నీరు లేకుండా పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న వర్షాకాలంలో వర్షాలు పడి కుంట నీటితో నిండితే పశువులు మేతమెయ్యడానికి నీళ్ళు తాగడానికి వెళ్ళే పశువులు, ప్రమాదవశాత్తు కుంటలో పడితే మృతిచెందే ప్రమాదం ఉందని, అన్నారు. రైతులు వ్యవసాయ పనుల మీద తూర్పు కుంట అటువైపు వెళ్తే కుంటలో పడి ప్రమాదాలు పొంచి ఉన్నాయని అన్నారు చుట్టు పక్కన ఉండే రైతులకు కూడా తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుంటే కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ కొమురయ్య, తోపాటు రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## నకిలీ సంస్థ వల.. ఇళ్లు గుల్ల



సిరిసిల్ల : నిరుపేదలకు చవకగా రెండు పడక గదుల ఇళ్లు కట్టించి ఇస్తామని ప్రచారం చేసుకొని డబ్బులు వసూలు చేసి చేతులెత్తేసిన ఎన్‌జీవో సంస్థ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురానికి చెందిన ఈ సంస్థ ప్రతినిధులు ఈ తతంగాన్ని నడిపించినట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ సంస్థకు చెందిన పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో సంస్థలో భాగస్వాములుగా మరో పది మందికిపైనే ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలోని ముస్తాబాద్ మండలం ముర్రాయిపల్లి, మద్దికుంట, మోహినికుంట, చీకోడు గ్రామాల్లో ఈ సంస్థ బాధితులున్నారు. జిల్లా పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి విచారణ జరుపుతున్నారు.

నమ్మించి.. వంచించి..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదల గృహనిర్మాణ పథకాల ద్వారా మంజూరుచేసే సొమ్ముతో పాటు తాము స్వచ్ఛంద సంస్థలో సభ్యులుగా చేరిన వారు ఇచ్చే డబ్బులతో ఇంటి నిర్మాణం చేయించి ఇస్తామని నమ్మబలికారు. 2020లో జిల్లాలో పరిచయం ఉన్న బడానాయకులతో ముస్తాబాద్ మండలాన్ని ఎంపిక చేసుకున్నారు. అక్కడ గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థ ఇప్పటికే అనంతపురంలో కొందరికి ఇంటి నిర్మాణాలు చేయించిందని ఫొటోలతో ప్రజెంటేషన్ ఇచ్చారు. మొత్తం రూ. 3.50 లక్షలు సంస్థకు చెల్లిస్తే ఎనిమిది నెలల్లో వసతులతో రెండు పడక గదులతో ఇంటి నిర్మాణం చేయించి ఇస్తామని నమ్మించారు. దీంతో నాలుగు గ్రామాలకు చెందిన సుమారు వంద మంది సంస్థకు రూ. 2 వేలు చెల్లించి సభ్యులుగా చేరారు. పలు విడతల్లో రూ. లక్ష నుంచి రూ. 3.50 లక్షల వరకు చెల్లించారు. ఇలా మొత్తం రూ. కోటిపైనే సంస్థ వసూలు చేసి ఎలాంటి రసీదులు ఇవ్వలేదు. కేవలం ఇంటినిర్మాణ ఒప్పంద పత్రం వెనకాల డబ్బులు ముట్టినట్లు రాసిచ్చారు. వీరిలో కొందరికి సిమెంటు, ఇసుక, కంకర అందించి పునాదులు, బేస్‌మెంటు, లెంటల్‌లెవల్ వరకు నిర్మాణాలు జరిగాయి. స్వచ్ఛంద సంస్థ ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం వేబిల్లులు చెల్లించకుండానే మానేరు నుంచి ఇష్టారీతిన ఇసుక తోడారు. ఆ ఇసుకను కొందరు నాయకులు ఇతర ప్రాంతాలకు లారీల్లో విక్రయించుకోవడం గమనార్హం.

వారి గుండెల్లో గుబులు

ఇంటి నిర్మాణాల్లో జాప్యం జరగడం.. డబ్బులు చెల్లించకపోవడంతో సంస్థపై బాధితులు 2022లో ముస్తాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఇంటి నిర్మాణాలు జరిగేలా చూస్తామని.. లేకుంటే డబ్బులు చెల్లించేలా మాట్లాడుతామని స్థానిక రాజకీయ నాయకులు నమ్మిస్తూ వచ్చారు. విసుగు చెందిన బాధితులు నేరుగా ఎస్పీని కలిశారు. విషయం ఎస్‌హెచ్‌వో పరిశీలనకు రాయడంతో కేసు నమోదైంది. కేసు విచారణ జరుగుతుండడంతో సంస్థకు అండగా నిలిచిన వారిలో గుబులు మొదలైంది.

ఇల్లు కటిస్తామంటే ఉన్నది కూల్చాం– పయ్యావుల బాలమల్లు, మోహినికుంట

గ్రామంలో రూ. 3.50 లక్షలకే రెండు పడక గదుల ఇళ్లు నిర్మాణం అంటే నమ్మాను. చేతిలో డబ్బులు లేకపోవడంతో రూ. లక్ష అప్పుచేసి చెల్లించాను. మూడేళ్లు గడిచినా నిర్మాణం ఊసేలేదు. కూల్చుకున్న ఇంటిలో పెళ్లీడుకొచ్చిన ఇద్దరు ఆడపిల్లలతో ఇబ్బందులు పడ్డాను. మానసిక వేదనతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాను. నా పరిస్థితిని చూసి గ్రామస్థులు అండగా నిలిచారు. సంస్థకు కట్టేందుకు చేసిన అప్పు వడ్డీతో కలిపి రూ. 2 లక్షలకు చేరింది.


తీసుకున్న డబ్బు తిరిగివ్వాలి – గూడెపు చంద్రం, ముస్తాబాద్

తక్కువ ఖర్చుతో రెండు పడక గదుల ఇంటి నిర్మాణం జరుగుతుందంటే ఆశ పడ్డాను. మూడు విడతల్లో రూ. 3.50 లక్షలు సంస్థకు చెల్లించాను. చెల్లించిన డబ్బులకు రసీదులూ ఇవ్వలేదు. ఇంటి నిర్మాణం చేస్తున్న వారితో గట్టిగా మాట్లాడితే రూ. 30 వేల విలువ చేసే సామగ్రి ఇచ్చారు. మూడేళ్లు గడుస్తున్నా పునాదులకే పరిమితం కావడంతో చాలా ఇబ్బందులు పడ్డా. రూ. 4 లక్షలు అప్పుచేసి స్లాబ్ వరకు నిర్మించుకున్నా. తీసుకున్న డబ్బులు సంస్థ తిరిగి ఇచ్చేయాలి.

విచారణ జరుగుతుంది– అఖిల్ మహాజన్, ఎస్పీ

బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కొందరిని అరెస్టు చేసి విచారణ జరుపుతున్నాం. ఈ సంస్థకు సంబంధించిన ప్రధానమైన వ్యక్తి కోసం గాలిస్తున్నాం. అతడు అదుపులోకి వస్తే పూర్తి వివరాలు బహిర్గతమవుతాయి. దాన్ని బట్టి బాధితులకు న్యాయం చేసే అవకాశాలపై చర్చిస్తాం.

## ఆదాయ మార్గాలపై నిర్లక్ష్యమేల?




కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థతోపాటు పురపాలికల్లో ఆదాయ మార్గాలు పెంచుకోవడానికి దుకాణ సముదాయాలు నిర్మించారు. వేలంపాట నిర్వహించి ప్రతి నెలా అద్దె వసూలు చేసుకోవడం ద్వారా రూ. లక్షల్లో రెవెన్యూ జమ అవుతోంది. ఈ దుకాణాలన్నీ రద్దీ ప్రాంతాల్లోనే ఉన్నాయి. అలాంటి దుకాణాల ద్వారా ఆదాయం ఎప్పటికప్పుడు పెంచుకునేలా చర్యలు తీసుకోవాల్సి ఉండగా పట్టనట్లుగా ఉంటున్నారు. నగరపాలిక పరిధిలో ఏళ్ల తరబడి అలాగే ఉండటం, బినామీల పేరు మీద వాటిని అప్పగించిన దుకాణాలు కూడా ఉన్నాయి. కొందరు అధిక మొత్తానికి ఇతరులకు అద్దెకు ఇచ్చిన వారున్నట్లుగా చెబుతున్నారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం 30 ఏళ్లు దాటిన దుకాణాల సముదాయాలకు మళ్లీ ఓపెన్ యాక్షన్ నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటికీ అలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రతి మూడున్నర ఏళ్లకు ఒకసారి అద్దెపై 33.3 శాతం పెంచాల్సి ఉంటుంది. గడువు దాటిన మడిగెలను గుర్తించడంలో రెవెన్యూ అధికారులు మాత్రం నిర్లక్ష్యాన్ని వీడటం లేదు.

161 దుకాణాలు.. రూ. 40 లక్షలు

నగరపాలక సంస్థకు మొత్తం 161 దుకాణ సముదాయాలు ఉన్నాయి. ఏటా అద్దె ద్వారా రూ. 40 లక్షల ఆదాయం సమకూరుతోంది. వీటిలో కార్యాలయం పక్కన ఉన్న రాజీవ్‌గాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌లో జీ౦1లో 50 దుకాణాలు ఉన్నాయి. వీటిలో 26 దుకాణాలు మాత్రమే అద్దెకిచ్చారు. మిగతావి కార్యాలయ అవసరాలకు, మెప్మా, ఈసేవ కార్యాలయం, గుత్తేదారుల సంక్షేమ సంఘానికి కేటాయించారు. పాత యూనాని ఆసుపత్రి(పాసుపోర్టు కార్యాలయం) కింది అంతస్తులో మొత్తం 8 ఉండగా అయిదు అద్దెకిచ్చారు. మూడు ఖాళీగా ఉన్నాయి. మున్సిపల్ అతిథిగృహం మొదటి అంతస్తులో 26 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. ప్రధాన కూరగాయల మార్కెట్ ప్రాంతంలో 32 దుకాణాలు ఉన్నాయి. టవర్ సర్కిల్ రోడ్డులో, టెలిఫోన్ భవన్ వైపు మొత్తం 45 దుకాణాలు ఉన్నాయి. వీటిని చిరు వ్యాపారులకు కేటాయించారు. చర్యలు శూన్యం సొంత ఆదాయం పెంపుకోసం పాటు పడాల్సిన నగరపాలక అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారు. ముప్పై ఏళ్లు దాటిన సముదాయాలు, ఖాళీగా ఉన్న దుకాణాలతోపాటు కొత్తగా స్మార్ట్‌సిటీలో భాగంగా నిర్మించిన షెడ్లు అప్పగించాల్సి ఉండగా, పట్టించుకోవడం లేదు. కొన్ని దుకాణాలకు ఏళ్ల తరబడి అద్దెలు బకాయిలు ఉన్నాయి. వీటన్నింటి ద్వారా బల్దియా ఆదాయం రెండు రెట్లు పెంచుకునే వీలుంది. ఈ విషయంలో అధికార యంత్రాంగం ఎలా వ్యవహరిస్తుందో చూడాల్సిందే.

దారి తప్పిన పునరావాసం

రోడ్లపై క్రయ, విక్రయాలు జరపకుండా కొన్నేళ్ల కిందట మార్కెట్ ప్రాంతంలో చిరు వ్యాపారులకు చిన్న, చిన్న గదులు నిర్మించి అద్దెకిచ్చారు. ఇందులో అసలైన లబ్ధిదారు ఎక్కడ ఉన్నారో తెలియకుండా మారగా వారిలో కొందరు తిరిగి మార్కెట్ ధరకు అద్దెకు ఇచ్చినట్లు బహిరంగంగానే చెబుతున్నారు. ఆర్థికంగా చేయూతనివ్వడానికి వీటిని అప్పగించగా ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారు. వీటికి అతి తక్కువగా అద్దె వసూలు చేస్తుండటం గమనార్హం.

ఆదేశాలు ఇచ్చాం– శ్రీనివాస్, కమిషనర్, బల్దియా, కరీంనగర్

మున్సిపల్ దుకాణాల గడువు ముగిసిన వాటికి సంబంధించినవి గుర్తించాం. రెండు, మూడు రోజుల్లో వేలం పాట నోటిఫికేషన్ ఇస్తాం.

## పట్టుబడుతున్న కొత్త సరకు!

ఖమ్మం : ఇటీవల జిల్లా ఆబ్కారీ టాస్క్‌ఫోర్స్ బృందం ఖమ్మం నగరంలో ఓ ముఠాను పట్టుకుంటే 13 కిలోల గంజాయి దొరికింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో 30.5 కిలోలు పట్టుబడింది. అయితే ఇదంతా కొత్త సరకు కావడం గమనార్హం. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు(ఏఓబీ)ల మధ్య అటవీ ప్రాంతంలో తాజా గంజాయి పంట అమ్మకానికి సిద్ధంగా ఉందనే సమాచారం చేరడంతో స్మగ్లర్లు, స్థానిక గంజాయి ముఠాలు పరుగులు పెడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రైవేటు పార్సిల్ సర్వీసుల్లో తరలింపు

ఆబ్కారీశాఖకు దొరక్కుండా ముఠాలు కొత్తమార్గాల్లో సరకు రవాణా చేస్తున్నాయి. భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సుల్లో రవాణా జరుగుతోందనే సమాచారం మేరకు వాటిని తనిఖీ బృందాలు క్షుణ్ణంగా శోధిస్తున్నాయి. ఇది పసిగట్టిన ముఠాలు భద్రాచలం నుంచి ఖమ్మం బస్సులు ఎక్కి.. ఇక్కడ దిగి వేరే బస్సుల్లో హైదరాబాద్ వెళ్తున్నారు. ఇతర రాష్ట్రాలకు రైళ్లలో చేరుకుంటున్నారు. ఇది గమనించిన తనిఖీ బృందాలు భద్రాచలం, ఖమ్మం బస్సులను పరిశీలించగా నాలుగు రోజుల వ్యవధిలో 43 కిలోల సరకు దొరికింది. నిందితుల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం చాలా సరకు కొరియర్, ఆర్టీసీ కార్గో, ప్రైవేట్ పార్సిల్ సర్వీసుల్లో చేరవేస్తున్నట్టు తేలింది.

ఆధునిక పరిజ్ఞానం వినియోగం

గంజాయి ముఠాలకు కచ్చితమైన సరకు సమాచారం అందుతోంది. ఇతర రాష్ట్రాల్లోని వారైతే ఎలా చేరుకోవాలనే రూట్‌మ్యాప్‌లు ఉంటున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఓ అంతర్రాష్ట్ర ముఠాను ఖమ్మంలో పట్టుకొంది. వీరి వద్దనున్న సమాచారం చూసి తనిఖీ బృందాలు విస్తుపోయాయి. మహారాష్ట్ర నుంచి ఒడిశాలోని గంజాయి సరకు లభించే చోటు వరకు ఎలా చేరుకోవాలో రూట్‌మ్యాప్ నిందితుల



సెల్‌ఫోన్లలో గమనించారు. ముఠా సభ్యులు మహారాష్ట్రలోని బుల్దాన్ నుంచి బయలుదేరి నిజామాబాద్ చేరుకున్నారు. అక్కడి నుంచి వరంగల్ మీదుగా సీలేరు, శబరి నది ఒడ్డుకు చేరుకుంటే సరఫరాదారులు వారిని తెప్పలో నది దాటించి ఒడిశా అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి 30 కిలోల సరకు ముట్టజెప్పారు. విస్తారంగా పండించిన గంజాయి పంట ఫొటోలు, వీడియోలను ముఠా సభ్యులు సెలఫోన్ల ద్వారా ఇతరులకు పంపినట్టు సమాచారం. భద్రాచలం–హైదరాబాద్ బస్సులో ఎక్కకుండా భద్రాచలం–ఖమ్మం బస్సు ఎక్కారు. వీరిలో ముగ్గురు పట్టుబడగా మిగిలిన ఇద్దరు తప్పించుకున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పుడక్కడ భారీగా గంజాయి పంట పండింది. తాజా సరకు రండీ అనే సందేశాలు ముఠాలకు చేరిన నేపథ్యంలోనే స్మగ్లర్లు ఒడిశా బాట పట్టినట్టు ఆబ్కారీ శాఖలో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఆబ్కారీ అధికారి నాగేంద్రరెడ్డి.. సీఐ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి దాడులకు వ్యూహరచన చేశారు. ఇప్పుడు వస్తున్న గంజాయి వరదను పరిమిత సంఖ్యలో ఉన్న ఆబ్కారీ బృందం ఎంతవరకు అడ్డుకుంటుందో చూడాలి. ఇప్పుడున్న నేరాలకు అనుగుణంగా ఆబ్కారీ శాఖను ఆధునికీకరించకపోతే సమస్యకు పరిష్కారం దొరకదనే వాదనలు వినిపిస్తున్నాయి.

## వాళ్లంతే.. తీరు మారదంతే..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్.. లేఅవుట్ లేని ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేశారని జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదులు అందాయి. సదరు అధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. సుమారు మూడు నెలలుగా అంతర్గత విచారణ పేరిట కాలయాపన తప్ప అతడిపై చర్యలు తీసుకోకపోవటం గమనార్హం.

భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి.. సబ్ రిజిస్ట్రార్ సంతకం ఫోర్జరీ చేయటం చర్చనీయాంశమైంది. సదరు ఉద్యోగి ఫోర్జరీ సంతకంతో బ్యాంకు నుంచి రూ. 35వేలు తీసినట్లు తేలటంతో సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఖమ్మం జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండేళ్లలో ఇద్దరు అధికారులు బదిలీ అయ్యారు. 2023 నవంబర్‌లో సరైన డాక్యుమెంట్, లేఅవుట్ లేని వెంచర్లకు రిజిస్ట్రేషన్ చేశారని ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ ఆరోపణలు ఎదుర్కొన్నారు.రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ లేని సమయంలో ఇన్‌ఛార్జి అధికారి ముడుపులు తీసుకుని తతంగం నడిపినట్లు తేలింది. ఆతర్వాత ఇద్దరి అధికారుల మధ్య విభేదాలు రావటం, ఫిర్యాదు అందటంతో సదరు అధికారిపై సస్పెన్షన్ వేటు పడింది.

ఈటీవీ – ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం రిజిస్ట్రేషన్ల శాఖలో అవినీతి జాడ్యం వదలటం లేదు. అక్రమ వెంచర్లలోనూ రిజిస్ట్రేషన్లకు పచ్చజెండా ఊపటం, అనుమతులకు విరుద్ధంగా భవంతులు నిర్మిస్తున్నా ముడుపులకు కక్కుర్తిపడటం సర్వసాధారణమయ్యాయి. శాఖాపరంగా అంతర్గత విచారణ పేరిట విచారణ జరిపి నామమాత్రపు చర్యలకు పరిమితమవటంతో అధికారులు, సిబ్బంది తీరు మారటం లేదు. రిజిస్ట్రేషన్ల శాఖలో సుమారు పదేళ్లుగా బదిలీల ఊసే లేకపోవటంతో కొంతమంది సిబ్బంది వసూళ్ల బాగోతానికి అడ్డుకట్ట పడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాల వారీగా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చటంలో హైదరాబాద్ తర్వాత వరంగల్, కరీంనగర్ జిల్లాలతో ఖమ్మం రిజిస్ట్రేషన్ల శాఖ పోటీపడుతోంది. అవినీతిలోనూ అంతకన్నా ఎక్కువ అప్రతిష్ఠ మూటగట్టుకుంటోంది.

మధ్యవర్తులు, సిబ్బంది కనుసన్నల్లో..

ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, కూసుమంచి, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రతినెలా సర్కారుకు సుమారు రూ. 20 కోట్ల ఆదాయం సమకూరుతుంది.అదేస్థాయిలో అవినీతి జరుగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. మధ్యవర్తులు, సిబ్బంది కనుసన్నల్లోనే ఈ తతంగమంతా సాగుతుంది. లేఅవుట్లు లేకపోతే ప్లాట్లు చేయకూడదనే నిబంధనను చాలా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పాటించటం లేదని, రూ. లక్షలు చేతులు మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. నగర, పురపాలికల్లో నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తున్నా రిజిస్ట్రేషన్లు సాఫీగా సాగుతున్నాయి. నజరానాగా అధికారులు, సిబ్బందికి ముడుపులు అందుతున్నాయనే వాదనలున్నాయి.

అంతర్గత విచారణతో కాలయాపన..!

కొన్నిచోట్ల ఏళ్ల తరబడి తిష్ఠవేసిన అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇంకొన్నిచోట్ల రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు లేకపోవటంతో సిబ్బందే పెత్తనం చెలాయిస్తున్నారు. గతేడాది చివర్లో అనేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. కొందరిపై ఆరోపణలు నిజమని తేలడంతో సస్పెండ్ లేదా బదిలీ అయ్యారు. మిగతావారిపై విచారణ ఇప్పటికీ కొలిక్కిరాలేదు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బందిపై ఆరోపణలపై విచారణ జరుపుతున్నాం. వాస్తవమని తేలితే చర్యలు తీసుకుంటున్నాం. కొందరిపై వేటు వేశాం. మరికొందరిని బదిలీ చేశాం. కొన్నిచోట్ల అధికారులపై ఫిర్యాదులు అందగా అంతర్గతంగా విచారణ సాగుతోంది.



# కరీంనగర్‌లో భారీ అగ్నిప్రమాదం

కరీంనగర్: కరీంనగర్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. జగిత్యాల రహదారిలోని సుభాష్‌నగర్‌లో వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికులు పూరిళ్లు వేసుకుని నివాసముంటున్నారు.

ఈ ప్రాంతంలో మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 5 గ్యాస్ సిలిండర్లు పేలాయి. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తుండటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అగ్ని మాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు తీవ్రంగా యత్నిస్తున్నారు. పూరిళ్లలోని కార్మిక కుటుంబాలు మేడారం జాతరకు వెళ్లడంతో ప్రాణనష్టం తప్పింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# కేఆర్ఎంబీ పరిధి అంశంపై ఏపీ పిటిషన్‌పై సుప్రీంలో విచారణ వాయిదా



న్యూఢిల్లీ : కృష్ణానదీ పరీవాహ ప్రాంతంలో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విద్యుత్ కేంద్రాలను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకురావాలని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టులో విచారణ వాయిదా పడింది. ఏప్రిల్ 30న తుది వాదనలు వింటామని జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం వెల్లడించింది. ఏపీ సర్కార్ పిటిషన్‌పై ఈరోజు సుప్రీంలో విచారణకు రాగా.. ఈ వ్యవహారంపై సుధీర్ఘ వాదనలు వినిపించాల్సి ఉందని అందువల్ల వాయిదా వేసి మరో తేదీ ఇవ్వాలని తెలంగాణ తరపు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ కోరారు. దీనికి ఏపీ తరపు న్యాయవాది రఘుపతి అభ్యంతరం తెలిపారు. తాము ఇప్పుడు వాదనలు వినిపించేందుకు సిద్ధం అని న్యాయవాది అన్నారు. ఇరువురి వాదనల అనంతరం పిటిషన్‌పై తదుపరి విచారణను సుప్రీం న్యాయస్థానం ఏప్రిల్‌కు వాయిదా వేసింది. ఏప్రిల్ 30న తుది వాదనలు వింటామని న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా స్పష్టం చేశారు. కాగా.. సంబంధిత అథారిటీ అనుమతి లేకుండా తెలంగాణ ప్రభుత్వం తమ పరిధిలో ఉన్న విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని, దీని వల్ల ప్రాజక్టుల్లో నీటి వాటా వినియోగంలో తేడాలు వస్తున్నాయని సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. 2021 ఏడాది తొలి అంకంలో అప్పటి తెలంగాణ ప్రభుత్వం అనుమతులు లేకుండా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయడంపై కేంద్రానికి పిర్యాదు చేయడంతో పాటు... అదే ఏడాది జులైలో సుప్రీంకోర్టును ఏపీ ఆశ్రయించింది. ఏపీ ప్రభుత్వ పిటిషన్‌పై కేంద్రానికి, కేఆర్ఎంబీ, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ జెన్‌కో సీఎండీలకు ఉన్నతన్యాస్థనం నోటీసులు జారీ చేసింది. ఈరోజు మరోసారి జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది.

# మేడారం జాతర.. సాధారణ ప్రయాణికులకు సజ్జనార్ విజ్ఞప్తి



హైదరాబాద్: మేడారం మహా జాతరకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం 6 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఇప్పటికే బస్సులు అక్కడికి వెళ్లినట్లు చెప్పారు. రద్దీ అధికంగా ఉండే ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో 51 క్యాంపులు ఏర్పాటు చేసి అక్కడి నుంచి బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు. “మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు భక్తులకు అసౌకర్యం కలగకుండా యాజమాన్యం అన్ని చర్యలు తీసుకుంటోంది. క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఇంత పెద్ద మొత్తంలో మేడారం జాతరకు బస్సులను తిప్పుతున్నందున రెగ్యులర్ సర్వీసులను తగ్గించాం. దీంతో సాధారణ ప్రయాణికులకు కొంత అసౌకర్యం కలిగే అవకాశముంది. ఈ సమయంలో భక్తులకు, ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలి. మేడారం జాతర పూర్తయ్యే వరకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కోరుతున్నా. తెలంగాణకే తలమానికమైన ఈ పండుగను విజయవంతం చేసేందుకు ప్రజలంతా సహకరించాలి” అని సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# మహిళలపై బీజేపీ వివక్ష చూపుతోంది: సునీతా రావు

ఖమ్మం జిల్లా: బీజేపీ మహిళలపై వివక్ష చూపిస్తోందని, మహిళా సాధికారిత అని చెప్పి దాన్ని విస్మరించిందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు విమర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. మొన్నటి వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు వ్యతిరేకంగా పని చేశాయని, దానికోసమే ‘నారి సమ్మేళనం న్యాయ్ యాత్ర’ చేస్తున్నామని చెప్పారు. రాజకీయ, విద్యా వ్యవస్థలో మహిళలకు అన్యాయం జరుగుతుందన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే మహిళలకు 51 శాతం రిజర్వేషన్ కల్పిస్తారని, డబ్బు పంచి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపొందాలని చూస్తోందని, బీఆర్ఎస్ నాయకులు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని ఆమె దుయ్యబట్టారు. గ్యాస్‌పై సబ్సిడీ కోసం మహిళా కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేస్తే వారిపై అక్రమ కేసులు నమోదు చేశారని సునీతా రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలు అధిక సంఖ్యలో కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తారని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. నిర్మల సీతారామన్, స్మృతి ఇరానీ, కల్వకుంట్ల కవితలకు మహిళల పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. గత 10 ఏళ్లలో రాష్ట్రంలో జరిగిన అవినీతిని ప్రజల ముందు ఉంచుతామని, తప్పు చేయకపోతే కేసీఆర్ ఎందుకు దొంగలా పారిపోతున్నారని ప్రశ్నించారు. హరీష్ రావు సీఎం అవ్వాలని రూ. 5 వేల కోట్లు వెనుక వేసుకున్నారని ఆరోపించారు. మహిళలపై దారుణాలు, కిడ్నాప్‌లు చేసేది బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలేనని అన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో లా అండ్ ఆర్డర్ అదుపుతప్పిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనని.. ఎందుకు అంటున్నామంటే పార్లమెంట్‌లో బీజేపీ ప్రవేశ పెట్టిన ప్రతి బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు తెలిపేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగుర వేస్తామని, మగవారికి సీట్లు దొరకడం లేదని సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడటం సరికాదని సునీతా రావు అన్నారు.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




# మేడమా మజాకా! ఇంటి నిండా డబ్బే..

హైదరాబాద్, ఫిబ్రవరి 20: హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అవినీతి బాగోతం మరవక ముందే మరో అవినీతి అధికారి ఏసీబీ వలలో చిక్కింది.

రూ.84 వేలు లంచం తీసుకుంటుండగా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి జ్యోతిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే జ్యోతిని అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు.. ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. **ఇదీ విషయం...** లంచం తీసుకుంటున్న ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి జ్యోతిని పక్కా సమాచారంతో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆపై జ్యోతి నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆ అధికారిణి నివాసంలో ఎక్కడబడితే అక్కడ నగదును, బంగారాన్ని అధికారులు గుర్తించారు. ఇంతటి బంగారాన్ని చూసి అధికారులే ఆశ్చర్యపోయిన పరిస్థితి. దాదాపు రూ.65 లక్షల నగదును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు.. నాలుగు కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జ్యోతిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు.. మరికాసేపట్లో కోర్టులో హాజరుపరుచనున్నారు.

# మూడు నామినేషన్లు తిరస్కరణ.. వారి ఎన్నిక లాంఛనమే!



హైదరాబాద్: రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం సాయంత్రం ముగిసింది. రాష్ట్రంలో 3 స్థానాలకు బరిలో ముగ్గురే మిగలడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా రేణుకాచౌదరి, అనిల్ కుమార్ యాదవ్, భారాస నుంచి వద్దిరాజు రవిచంద్ర నామినేషన్లు మాత్రమే మిగిలాయి. శ్రమజీవి పార్టీ తరఫున జాజుల భాస్కర్, భోజరాజు కోయల్కర్, స్వతంత్ర అభ్యర్థిగా కిరణ్ రాథోడ్‌లు నామినేషన్లు ఇచ్చారు. రాజ్యసభ అభ్యర్థిగా పోటీ చేయాలనుకునే ఒక్కో అభ్యర్థికి మద్దతుగా కనీసం 10 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేయాల్సి ఉంటుంది. కాంగ్రెస్, భారాస అభ్యర్థులు మినహా.. మిగిలిన ముగ్గురికి మద్దతుగా ఎమ్మెల్యేలెవరూ సంతకాలు చేయలేదు. దీంతో వారి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి తిరస్కరించారు. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి అనంతరం ఇద్దరు కాంగ్రెస్, ఒక భారాస అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిట్నరింగ్ అధికారి ప్రకటించనున్నారు.

# తమిళి సై ‘ఎక్స్’ ఖాతా హ్యాకింగ్ ఎక్కడి నుంచి జరిగిందంటే..!

హైదరాబాద్: తెలంగాణ గవర్నర్ తమిళి సై ‘ఎక్స్’ ఖాతా హ్యాక్ విచారణను అధికారులు ముమ్మరం చేశారు. ముంబై నుంచే గవర్నర్ తమిళి సై ‘ఎక్స్’ ఖాతా హ్యాక్ అయినట్టు సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. అక్కడి ఓ బొటెక్ వైఫై నెట్‌వర్క్‌ను దుండగుడు వినియోగించినట్టు సాంకేతిక ఆధారాల ద్వారా కనిపెట్టారు. బొటిక్ సంస్థ నిర్వాహరాలిని ప్రశ్నించినా వివరాలు తెలియవని చెప్పినట్టుగా సమాచారం. దర్యాప్తు అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. గత కొన్ని రోజులుగా బోటిక్ షాప్ మూసి వేసే ఉంది. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ఎక్స్ అకౌంట్ హ్యాక్‌కి గురైంది. ఈ నెల 14న ఆమె అకౌంట్ హ్యాక్ అయినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోతాజాగా మూడు ఐపీ అడ్రస్‌లను గుర్తించారు. ఐపీ అడ్రస్‌ల ద్వారా వివరాలు పంపాలని ఆయా సర్వీస్ ప్రొవైడర్లను కోరారు. అలా అందిన సమాచారంతో ముంబై నుంచి ఖాతాను హ్యాక్ చేసినట్టు సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు.



# సిటీ బస్సుల్లో ప్రయాణం.. 4 రోజులు తిప్పలే..

# మేడారం జాతరకు తరలుతున్న 1800 సిటీ బస్సులు

హైదరాబాద్ : మేడారం జాతర ఎఫెక్ట్‌తో నగరంలోని సిటీబస్సు ప్రయాణికులకు ఇక్కట్లు తప్పేట్లు లేవు. ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న మేడారం జాతరకు గ్రేటర్ జోన్‌నుంచి 1800 సిటీబస్సులను నడిపించాలని నిర్ణయించారు. దీంతో గ్రేటర్ జోన్‌లో పరిధిలో బుధవారం నుంచి శనివారం వరకు 800 బస్సులు మాత్రమే తిరగనుండడంతో ఏమేరకు సేవలు అందిస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది. గ్రేటర్‌జోన్ వ్యాప్తంగా ప్రతిరోజు ఆర్టీసీ 2,640 బస్సులు నడుపుతూ 21 లక్షలమంది సిటీ ప్రయాణికులను చేరవేస్తోంది. ఈనెల 21నుంచి మేడారం సమ్మక-సారలమ్మ జాతర ప్రారంభ నేపథ్యంలో గ్రేటర్‌జోన్ నుంచి సోమ, మంగళ, బుధవారాల్లో వరుసగా 600 చొప్పున మొత్తం 1800 సిటీ బస్సులను జాతరకు వెళ్లే భక్తులకోసం ఆర్టీసీ కేటాయించింది. జాతరకు లక్షల సంఖ్యలో వెళ్లే భక్తులను దృష్టిలో పెట్టుకొని టీఎసఆర్టీసీ మొత్తం 6 వేల ప్రత్యేక బస్సులు నడుపుతోంది. జాతర ప్రాంగణానికి 20-30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాల నుంచి భక్తుల రద్దీకి అనుగుణంగా గ్రేటర్‌కు చెందిన సిటీబస్సులను నడపనున్నారు. ఈ బస్సులు ఈనెల 21నుంచి 24 వరకు అక్కడే ఉండి భక్తులకు సేవలందించనున్నాయి. దీంతో సోమవారం 2040 బస్సులు, మంగళవారం 1440 బస్సులు, బుధవారం నుంచి శనివారం వరకు గ్రేటర్ జోన్‌లో 800 బస్సులు మాత్రమే సిటీ ప్రయాణికులకు అందుబాటులో ఉండనున్నాయి.

70 శాతం సిటీబస్సులు జాతరకు తరలివెళ్లడంతో సిటీ ప్రయాణికులు ప్రత్యామ్నాయ ప్రయాణ మార్గాలు చూసుకోవాల్సి ఉంటుంది. మేడారం స్పెషల్ ఆపరేషన్స్‌కు బస్సులు వెళ్తుండడంతో సిటీ ప్రయాణికులు తమకు సహకరించాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.
**నగరం నుంచి సేవలకు 400 బస్సులు..** మేడారం జాతరను పురస్కరించుకుని నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఈనెల 19 నుంచి శనివారం వరకు ఆర్టీసీ 4 వందల ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రంగారెడ్డి రీజినల్ మేనేజర్ ఎ.శ్రీధర్ తెలిపారు. ఎంజీబీఎస్, జూబ్లీ బస్‌స్టేషన్, ఉప్పల్ ప్రాంతాల నుంచి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు.

# బీజేపీ ‘విజయసంకల్ప’ యాత్ర ప్రారంభం

నిర్మల్, ఫిబ్రవరి 20: పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి కమలం పార్టీ శ్రీకారం చుట్టింది. నేటి నుంచి మార్చి 2 వరకు విజయసంకల్ప యాత్ర పేరుతో రథయాత్రలు చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా మంగళవారం ఉదయం బాసర సరస్వతీ దేవి ఆలయం నుంచి బీజేపీ విజయసంకల్ప యాత్ర ప్రారంభమైంది. ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే రామారావు పాటిల్.. వాహనాలకు పూజలు నిర్వహించి అనంతరం యాత్రను ప్రారంభించారు. అలాగే.. బాసరలో అస్సాం సీఎం హేమంత బిస్వా శర్మ, యాదాద్రిలో గోవా సీఎం ప్రమోద్ సావంత్ రథయాత్రలో పాల్గొంటారు. నారాయణపేటలో కిషన్ రెడ్డి, తాండూరులో రథయాత్రలో బండి సంజయ్ పాల్గొననున్నారు. డీకే అరుణ, ఈటల, లక్ష్మణ్, ఎంపీ ధర్మపురి అర్వింద్ తదితరులు రథయాత్రలో పాల్గొంటారు. 17 పార్లమెంట్, 14 అసెంబ్లీ సెగ్మెంట్లలో 5,500 కిలోమీటర్ల మేర రథయాత్రలు సాగనున్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను కమలం పార్టీ నేతలు కలుసుకోనున్నారు. కేంద్ర విజయాలు, కాంగ్రెస్ కుంభకోణాలు, బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారు.
**మాదే విజయం: ఎంపీ బాపురావు –** అంతకుముందు ఎంపీ సోయంబాపురావు, బీజేపీ నేతలు సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ బాపురావు మాట్లాడుతూ.. విజయ సంకల్ప యాత్రలతో పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరిస్తున్నామన్నారు. మోదీ పాలనలో జరిగిన అభివృద్ధి, జరగబోయే అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామని తెలిపారు.

బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదని.. అది మునిగే పడవ అంటూ వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ నుంచి తానే పోటీలో ఉంటానని.. భారీ మెజారిటీతో గెలుస్తానని ఎంపీ సోయంబాపురావు ధీమా వ్యక్తం చేశారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660